"హిమగిరుల అందాలను కళ్లారా చూసే అదృష్టం అలనాటి ప్రవరాఖ్యునికే గానీ నేడు నాలాంటి పామరులకు కుదరదా బావా?" వాళ్లక్కయ్య అందించిన చాయ్‌ని అమృతంలా చప్పరిస్తూ నాగేశం సంధించిన ప్రశ్నాబాణానికి స్పందించాలనిపించలేదు. మా



# మంచు మన్ను

కెదురుగా సింగిల్ సోఫాలో కాళ్లాడిస్తూ కూర్చున్నాడు నాగేశం. మేముకూడా చాయ్ ఆనందంలో తేలిపోతున్నాం.

నాకేమీ వినబడనట్టే పేపర్లో తల దూర్చాను. ఎడమపక్క కూచున్న భవాని వెనకనుంచి నా జబ్బగిల్లింది. ఖాళీ చాయ్ గ్లాసు టీపాయ్‌మీదుంచి చూపులు అటు మళ్లించాను. "అక్కా తమ్ముళ్లేదో చర్చించుకుంటున్నారు. నాగురించేనా?" కావాలనే అడిగాను.

భవాని మొహం చిట్లించి "బ్రహ్మాండమంతా ఒకవైపైతే బావమరిది మరోవైపు అంటారు గానీ మీకైతే మా తమ్ముడంటే తుమ్మ ఆకుతో సమానం". తాను ఖాళీచేసిన చాయ్‌గ్లాసుని టీపాయ్ కప్పగిస్తూ ముక్కూ మూతీ ఒకేసారి తిప్పేసింది.

అలా ప్రారంభమైన మా సంభాషణ ఎన్నెన్నో మలుపులు తిరిగి, చార్‌ధామ్ (యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్) యాత్రలకు బయలుదేరదీసింది.

యాత్రాస్పెషల్ బస్సు... లగ్జరీకోచ్... మా వెంట బామ్మర్ది నాగేశం - వాసవి జంట... పక్కపక్క సీట్లు. గయ, వారణాసి, హరిద్వార్ పుణ్యక్షేత్రాలను దర్శించి రుషీకేష్‌లో ప్రవేశించాం. రుషీకేష్ అంటే... హిమాలయాలకు పాదపీఠంలాంటిది. మామూలు బస్సులు అక్కడే ఆగిపోవాలి. అది హైటెక్ అయినా సరే... అక్కడే విశ్రాంతి తీసుకోవాల్సిందే. రుషీకేష్ నుంచి హిమాలయ పర్వతారోహణం. అక్కణ్నుండి ప్రత్యేకబస్సులు. ఘాట్ రోడ్‌లో నిరాఘాటంగా నడిచే బస్సులు, వాటిని సమర్థవంతంగా నడిపే డ్రైవర్లను మాత్రమే అనుమతిస్తారు.

అంతకు ముందెన్నోసార్లు హిమగిరుల పుణ్యక్షేత్రాలను దర్శించి, మాముందు తన అనుభవాలను ఆరబోసిన టూర్ మేనేజర్ సూచననుసరించి వెంట తెచ్చుకున్న లగేజినంతా రుషీకేష్‌లో మేము బసచేసిన ఆంధ్రాశ్రమంలో ఉంచేసాం. వారం పది రోజులకు సరిపోయే నిత్యావసరమైన డ్రెస్సులు, టవల్స్ వంటివి మాత్రం ఓ బ్యాగులో వేసుకుని ప్రత్యేకబస్సులో పాదార్పణం చేసాం. చల్లని ప్రదేశం కాబట్టి ఒంటికి వేడినిచ్చే వెల్లుల్లిపచ్చడి సీసాలు రెడీమేడ్‌వి కొనుక్కున్నాం. మంచు కురవడమనేది మంచుకొండల్లో మామూలు విషయమైనా... మాకు ఆ దృశ్యాలు - తెల్లని ముసుగులు ధరించి దివి నుంచి భువికి దిగివస్తున్న దేవకన్యల్లా కన్పిస్తున్నాయి. చల్లని పర్వతారోహణంలో వెచ్చని అనుభూతి. అది చలికాలమో, వానాకాలమో

ఐతా చంద్రయ్య

అర్థంకాని పరిస్థితి.

పావనగంగా తీరాన ప్రవహిస్తున్న ఆధ్యాత్మిక భావవాహిని, రుషిమునుల తపోభూమి... రుషీకేష్‌నుంచి ప్రత్యేకబస్సు బయలుదేరుతూంటే గుండె గూటిలో ఒదిగిఉన్న ఆసక్తి రెక్కలు రెపరెపలాడించింది. కొన్నివందల కిలోమీటర్లు ప్రయాణించి ముందు ఉత్తరకాశి చేరుకోవాలి. అక్కణ్నుంచి ఒక్కో ధామ్ (పుణ్యక్షేత్రం) మధ్య వందల కిలోమీటర్ల దూరం, రోజులకొద్దీ ప్రయాణం.


మల్లెపూల పరిమళాలను మరిపించే అన్నం దొరకదు. పచ్చళ్ల ఘుమఘుమల పత్తా ఉండదు. ఇడ్లీ, వడ, ఉల్లిపాయదోశ, ఊతప్పం లాంటి టిఫిన్ల ఉనికి కరువు. పప్పు - రొట్టెలతో సరిపెట్టుకోవాలని మానసికంగా తయారయ్యాం. అయితే ఏం? గంగ, యమున, సరస్వతి, మందాకిని, భాగీరథి, అలకానంద వంటి పుణ్యనదుల్లో పవిత్ర స్నానాలాచరించే సువర్ణావకాశం అందరికీ లభిస్తుందా? భగీరథుని కఠోరతపస్సుకి తలవంచి ఆకాశంనుంచి దిగివస్తున్న గంగామాత పరమశివుని జటాజూటంలో ప్రవేశించిన పుణ్యక్షేత్రం, యమునానది పుట్టి పారాడడం ప్రారంభించిన యమునోత్రి, హరిహరాదుల ఆటవిడుపు, పురాణ సంఘటనల ప్రదేశాలు, దేవతామూర్తుల దర్శనం... అల్లాటప్పాగా లభిస్తాయా?

అందరిచూపులూ కిటికీల్లోంచి లంఘిస్తున్నాయి. సూర్యకిరణాలు కప్పుకున్న పర్వతాలు వెండికొండల్లా కన్పిస్తున్నాయి. ఎటుచూసినా మంచుపూవులే... అందాల హరివిల్లులే.

వగలమారి వయ్యారిలా బస్సు మలుపులు తిరుగుతూ పైకెళ్తోంది. ఒకపక్క ఎత్తయిన పర్వతశ్రేణులు, మరోపక్క లోతైన లోయ. లోయలోంచి నదీసుందరి సంగీతఝరి దిగివస్తోంది. లోయలోకి చూస్తే... బస్సు దాని అంచునే పరుగెత్తుతున్నట్టుంది. ఏమాత్రం అటు ఇటైనా లోయలో పడిపోతుందేమోననే భయంతో కళ్లు తిరుగుతున్నాయి. అయితే ఏం? లోయల్లోంచి ఏపుగా పెరిగి, వచ్చీపోయే జనాలకు తలలూపుతూ పలుకరిస్తున్న చెట్లు, కొండచరియలమధ్య వరుసలుగా పెరిగిన పచ్చనిమొక్కలు... ఆ ప్రాంతమంతా నిత్యకళ్యాణం - పచ్చతోరణంగా కన్పిస్తోంది. ఓ వైపు లోయ, మరోవైపు పర్వతశ్రేణి... నదీప్రవాహం ఒడ్డునుంచి పర్వతాలను తొలిచి రోడ్డువెయ్యడం భగీరథ ప్రయత్నమే. ఆ ప్రయత్నాన్ని ఫలవంతం చేసిన మేధావులు, కార్మికులకు హేట్సాఫ్ చెప్పి తీరాలి. ఎన్నో చోట్ల... పర్వతశ్రేణుల్లోంచి లోయలోకి జారుకుంటున్న జలపాతాలు... దేవతలు కురిపిస్తున్న మల్లెపూల వానలాగున్నాయి. అప్పటికప్పుడే ఆకాశమ్మీది నల్లనిమేఘాలు పర్వతశిఖరాలను ముద్దాడుతూ ఆనందాశ్రువుల్ని రాలుస్తున్నాయి. ఆ హర్షోల్లాస వర్షం ఎంతోసేపుండదు. మేఘాలను చీల్చుకుని నేనున్నానంటూ సూర్యుడు బయటికొచ్చి పర్వతాల ఒంటినిండా కిరణపుంజాలు వెదజల్లుతున్నాడు.

"బావా! ఇది డెహ్రాడూన్!" వెనకనుంచి భుజం తట్టాడు నాగేశం. తాదాత్మ్యంలోంచి బయటికొస్తూ తలపంకించాను.

"అవును. ఉత్తరాంచల్ రాష్ట్ర రాజధాని పట్టణం! తలను అటు తిప్పాను. పర్వతశ్రేణుల మధ్య వెలసిన పట్టణమది. పెద్దపెద్ద బంగళాలు, ఆధునిక గృహాలు విసిరేసినట్టున్నాయి. అంతేకాదు, వాటిమధ్య పచ్చని మైదానాలు... అన్నీ కలిసి జారుడు బండమీంచి జారుతున్నట్టున్నాయి.




"ఇక్కడ రోడ్డు పక్కనే ఏ.టి.యం. ఉందన్నారు గదా బావా!"

అప్పుడు గుర్తుకొచ్చింది - అప్పటికే పది రోజులు ప్రయాణించామని, పర్సులు ఖాళీ అవుతోంటే లోలోపల ధైర్యం సన్నగిల్లుతోందని.

"అవునవును... మేనేజర్‌తో చెప్పు, ఏ.టి.యం. దగ్గర ఆపమని" అలౌకికానందాన్ని అటుతిప్పేస్తూ ఆర్డరేసాను. అర్ధాంగి భవాని అర్ధనిమీలితనేత్రాలు అమాంతం తెరుచుకున్నాయి నావైపు గుర్రుగా చూస్తూ.

"ఏదో పాపమని మా తమ్ముడు గుర్తుచేస్తే వాడికే పురమాయిస్తారా?" నిలదీసింది. "ఇది న్యాయం గదా!"

"అబ్బా! ఇక్కడకూడా న్యాయాన్యాయాల శల్యపరీక్షేనా? కుదురుగ్గా కూచుని ప్రకృతి అందాలను కనువిందు చేసుకోవోయ్..."

మా వాగ్వివాదం ఇంకాసేపు కొనసాగేదే మోకానీ అప్పుడే బస్సు ఏ.టి.యం. బంగళా ముందు ఆగింది. నాగేశం, నాతోపాటు మరో ఇద్దరు దిగి ఒళ్లు విరుచుకున్నాము. అప్పుడే నిద్రమేల్కొన్నట్టు బంగళా మెట్లెక్కాము. ఏ.టి.యం. ముందు క్యూలో చేరాము. నా వెనక నాగేశమున్నాడు.

మనిషి మేధోమధనం ఫలితంగా తయారైన యంత్రాలు మనుషులనాడిస్తున్నాయి. మనిషి సృష్టించిన డబ్బులు మానవులను కీలుబొమ్మలుగా మార్చేస్తున్నాయి. మనిషికీ మనిషికీ మధ్య అపనమ్మకాలు పెరిగి యంత్రాలకు బానిసలుగా మార్చేస్తున్నాయి. మానవుడు తయారుచేసిన కరెన్సీనోట్లు యంత్రాల్లో నిక్షిప్తమై మనను ఆడిస్తున్నాయి...

"ఎటు చూస్తున్నావు బావా! పదలోపలికి" జబ్బపట్టి ఏ.టి.యం. లోపలికి లాక్కెళ్లాడు నాగేశం. డబ్బులతో పర్సునిండగానే మనోస్థైర్యం కొత్త బలాన్ని పుంజుకుంది. చిరునవ్వులతో తిరి

గొచ్చి బస్సెక్కబోయాము.

బస్సు ఖాళీగదిలా నిశ్శబ్దంగా ఉంది. ముచ్చట్లు అచ్చట్ల అనవాళ్లు లేవు. బస్సులో ఎవరూ లేరేమిటి? నలుగురం మొహాలు చూసుకున్నాం. అటూ ఇటూ చూస్తున్నాం.

పక్కహోటల్లోంచి చాయ్‌గ్లాసుతో బయటి కొచ్చాడు డ్రైవర్. "సార్! ఇక్కడికి కొద్దిదూరంలో ప్రకాశేశ్వరాలయముంది. అందరూ అటువెళ్లారు. మీరు కూడా వెళ్లిరండి. మందిరం చూసి తీరాల్సిందే" చాయ్ చప్పరిస్తూ పల్లం రోడ్డు వైపు చూపించాడు. అతని హిందీలో గర్వాల్ భాష మిళితమై వినసొంపుగా ఉంది. "అదిగో... అటు చూడండి... మందిరశిఖరం కన్పిస్తోంది" వేలితో చూపించాడు.

ఊపిరి పీల్చుకుని అటువైపు కదిలాము. మాతో వస్తున్న మిగతా ఇద్దరిలో ఒకాయన బ్యాంక్ ఆఫీసర్ భీమేశ్వర్. మరొకాయన ప్లాట్ల వ్యాపారి పాపారావు. నలుగురం అడుగులో అడుగేస్తూ నడుస్తున్నాం. అది పట్టణం కాబట్టి రెండువైపులా కొండలున్నాయి. వాటి మీది భవనాలు... గర్వంగా ఛాతీవిరిచి "మేమున్నాం. మీరు పదండి" అంటున్నాయి.

పచ్చని మైదానాల్లో రంగురంగుల మేడలు విసిరేసినట్టున్నా అన్నీ కలిసి ఇంద్రధనుస్సుల్లాగున్నాయి. మా మనసులు పురివిప్పిన మయూరాలైనాయి.

"ఇక్కడి ప్రజలు చాలా అదృష్టవంతులు గదా!" పరిసరాలను పరికిస్తూ ప్లాట్ల వ్యాపారి పాపారావుఅన్నాడు. "ఇక్కడ రియలెస్టేట్ వ్యాపారం బాగున్నట్టు లేదు" పెదవి విరిచాడు.

"వ్యాపారం సంగతేమోకానీ ఈ ప్రకృతి దృశ్యాలను కళ్లారా చూస్తుంటే కడుపునిండిపోతుంది". బ్యాంక్ ఆఫీసర్ భీమేశ్వర్ పెదాలు చప్పరించాడు.

నాగేశం నోరు ఊరుకోదుగదా!

"ఆ! ఏముంది సార్!" భుజాలెగరేశాడు.

"అదేమిటోయ్! ఈ వాతావరణం నీకు బాగన్పించడం లేదా?" మా ముగ్గురి తరపున అడిగాను.

"చౌరస్తాలు, బంగళాలు, మైదానాలు చూడ ముచ్చటగానే ఉన్నాయి కానీ..." నాగేశం చేతులు విదిలించాడు. "తినగతినగ వేము తియ్యనుండు మాదిరిగానే తినగతినగ స్వీటు చేదైపోతుందట. అలాగే ఎంతమంచి ప్రకృతి దృశ్యాలనైనా రోజూ చూస్తుంటే మొహంమొత్తి మామూలైపోతుంది."

"అది కూడా ఓ లాజిక్కే" నాగేశం పక్కనే నడుస్తూ అందుకున్నాడు పాపారావు. "మనం తాగు - సాగు నీటి కోసం తపస్సు చేస్తుంటాము. ఇక్కడ ఆ సమస్య లేదు గదా!"

"అతి సర్వత్ర వర్జయేత్ అనే మాట కూడా గుర్తుంచుకోవాలి" నాగేశం కళ్లూ, ఒళ్లు నాట్య భంగిమ చూపాయి. "ఇక్కడెప్పుడూ వర్షాలు పడుతుంటాయి. ఇవే వర్షాలు జోరై ప్రాణాలు తీస్తుంటాయి".

"అదెట్లా?" నా పక్కన నడుస్తున్న భీమేశ్వర్ అడిగాడు.

"వర్షం కాలువలు కొండచరియల మధ్య జలధారలు సృష్టిస్తాయి. మట్టిముద్దల్లాగున్న కొన్ని కొండచరియలు విరిగి రోడ్డుమీద పడిపోవడం సర్వసామాన్యం. అవి రోడ్డుమీదున్న మనుషులమీదనో, వాహనాలమీదనో పడి ప్రాణాలు పోతుంటాయని వార్తల్లో చదివాంగదా"..

నాగేశం వాదన నిజమేకానీ ఆ సమయం లో మాకది రుచించలేదు. విషయం దారిమళ్లిం చాలని నేను, భీమేశ్వర్ సైగలు చేసుకున్నాము.

"పొద్దున పదింటికి భోంచేసి బస్సెక్కాం గదా" భీమేశ్వర్ అందుకున్నాడు "కడుపులో చిట్టెలుకలు పరుగెడుతున్నాయ్ గదండీ!" పాపా రావు వైపు చూసాడు.

"అవునవును" పాపారావు రిస్టువాచీ చూసు కున్నాడు. "ఇప్పుడు సాయంత్రం నాలుగైంది" రోడ్డు పక్కనున్న హోటల్ చూపించాడు కళ్లతో.

"అదిగో... ప్రకాశేశ్వరాలయం. వారెవ్వా... మెట్లు అద్దాల్లాగున్నాయి" అటు చూపించాను. అందరి దృష్టి అటు మళ్లింది. గబగబా అడు గువేసాం.

ప్రకృతిఒడిలో పవిత్రదేవాలయం తపో భూమి లాగుంది. ఆలయం అంతా పాలరాతి మయం. వెన్నముద్దలతో కట్టినట్టు గోడలు తెల్ల గా, నున్నగా... మెరుస్తున్నాయి. గేటువద్ద శ్రీమ తులు మాకోసం ఎదురు చూస్తున్నారు. వెంటనే జంటలుగా మారాము. గుడినిండా జనాలు... జాతరలాగుంది కానీ అంతా మౌనతపస్సుల్లాగు న్నారు. విచిత్రం... అంతా నిశ్శబ్దం... గుండె చప్పుళ్లేకానీ గుసగుసలు కూడా లేవు. ఎవరికి వారొచ్చి వరుసలో నిల్చుంటున్నారు. మా చెల్లి (నాగేశం భార్య) వాసవి నా వైపు చూసింది. ఆ చూపులోని అంతరార్థం గ్రహించాను.

"ఇక్కడేమీ మాట్లాడొద్దు" ముక్కుమీద వేలేసుకుని నాగేశంకు సైగతో హెచ్చరించాను.

'ఇక్కడ హుండీలు లేవు'... 'ఎవరికీ డబ్బు లివ్వరాదు'... 'దేవుని వద్ద డబ్బులుంచరాదు'... హిందీ, ఇంగ్లీషులో అందంగా రాసుంచిన సైన్‌బోర్డులు... ఆశ్చర్యంలో ముంచెత్తాయి.

తెలిసో తెలియకో చేసిన పాపాలను వది లించుకుని పుణ్యం మూటగట్టుకెళ్దామని పుణ్య క్షేత్రాలకొచ్చిన భక్తుల్ని నానారకాలుగా దోపిడి చేసే క్షేత్రపాపులున్న ఈ రోజుల్లో ఇదొక అరు దైన ఆధ్యాత్మిక వాతావరణం. అందరిలాగే మే మూ వరుసలో నుంచున్నాం.

స్పీకర్స్‌లోంచిగాయత్రి మంత్రం, శాంతి మంత్రం మంద్రస్వరంలో వినబడుతున్నాయి. ఒళ్లు గగుర్పాటు... ఒకరివెనక ఒకరం ఒద్ది కగా, బుద్ధిగా క్యూలో ముందుకెళ్తున్నాం. మన సంతా ఉల్లాసం, ఉత్సాహం, దైవీభావనతో ప్రశాంతంగా ఉంది.

మూలవిరాట్టు ముందుకెళ్లాము. ముగ్ధ మనోహర స్వరూపం. భక్తజన మనోవిహారి... మురళీ మనోహరుని దివ్య మంగళరూపం... దర్శన భాగ్యంతో నా హృదయపుష్పం సహస్ర దళాలుగా వికసించింది. చేతులు జోడించుకు పోయినై. అపురూపం... అద్వితీయం... శిరస్సు వంగిపోయింది.

...భగవంతుడా! ఈ జన్మకిది చాలు. నా మనోభావనను నైవేద్యంగా స్వీకరించు. నేనో పూవునై నీ పాదాలచెంత రాలిపోనీ. నాకు మో క్షం ప్రసాదించు స్వామీ!... కన్నతల్లికి చేతులం దిస్తూ కేరింతలు కొడుతున్న పసిపాపలా అంత రాత్మ ఆరాటపడిపోతోంది. జీవితాంతం అలానే ఉండిపోవాలన్పించింది. పక్కనే తీర్థం వితర ణ... కదలాల్సివచ్చింది.

తీర్థం సేవించగానే... పచ్చని ఆకులో దోసి లి నిండా ప్రసాదం... కిచ్‌డీ... ఘుమఘుమ లాడ్తోంది. బయటికొచ్చి వరుసగా వేసున్న కుర్చీల్లో కూచుని ఆరగించాం. రుచి... అమో ఘం. కడుపు నిండిపోయింది. "నన్ను ఉపయో గించుకోండి" రాసున్న చెత్తబుట్టలో ఆకులు

పడేసి, వరుసలో వెళ్లి చేతులు కడుక్కున్నాము.

"అక్కడ చాయ్ సేవించండి" మంచినీటి స్టీల్ డ్రమ్ముపైన... గోడకు బాణం గుర్తు... అక్షరాలు కన్పించాయి. అక్కడ కూడా క్యూ... దానంతటదే ప్రోదియైన క్రమశిక్షణ.

పింగాణి గ్లాసునిండా చాయ్... పొగలు కక్కుతోంది. అందుకుని పక్కకు జరిగాము. కుర్చీల్లో కూచుని చాయ్ చప్పరిస్తూంటే తృప్తిగా ఉంది.

"దేవాలయాలు మానవుడిని మాధవుడిగా తీర్చిదిద్దే శిక్షణాలయాలు. బయట దోసిళ్లతో సంపాదించిన సంపదలనక్కడ పిడికిళ్లతో పంచి పెట్టే ధర్మాత్ముల కర్మక్షేత్రాలు. బాటసారుల, అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణనిలయాలు..."

మధురమనస్వి, తపోధనుడైన ఓ స్వామీజీ ఎప్పుడో... ఓ గీతాజ్ఞాన యజ్ఞం సందర్భంగా వెలిబుచ్చిన అభిప్రాయానికది ఆచరణ కేంద్ర మనిపించింది.

అందరిలాగే మేముకూడా గ్లాసులు కడిగి నిర్ణీతస్థానంలో ఉంచాము. అంతదాకా అందరి నోళ్లకూ సీలు వేసుంచడం గొప్ప విశేషమే. ప్రకాశేశ్వర ఆలయ నీడలు దాటామోలేదో...

"ఆహా... ఓహో!" సంభాషణకు నాగేశం శ్రీకారం చుట్టాడు. "నేనెక్కడా చూడలేదిట్లా. బయట బిచ్చగాళ్ల అరుపులు లేవు, లోపల పూజారుల సతాయింపులు లేవు. కంటినిండా దర్శనం, కడుపునిండా ప్రసాదం, ఆ తరువాత వేడి చాయ్... హాయిగా ఉంది గదా బావా!"

"ఈ భూమ్మీద మనిషి ఎన్నాళ్లు బతికాడనేది కాదు, ఏం సాధించాడనేది ముఖ్యం. ఎవరో ధర్మాత్ములు, పుణ్యాత్ములు ఇంతమంచి ఏర్పాట్లు చేసారు. వాళ్లకు చేతులెత్తి దండం బెట్టాలి".


నా అర్ధాంగి భవాని నా వేలు వదిలి వాసవి చెయ్యందుకుంది.

"ఎందరో చైతన్యమూర్తులు మనదేశ సంస్కృతినిట్లా రక్షిస్తున్నారు. అసలైన దేవాలయమంటే అలాగుండాలి" అంటూ వాసవి నాగేశం చెయ్యి వదిలి భవాని భుజమ్మీద చెయ్యేసింది.

"ప్రసాదం ఉద్దేశ్యం ఆకలి తీర్చడమే గదా!" శ్రీమతి భీమేశ్వర్ భవాని పక్కకొచ్చింది. "శుచీ-శుభ్రత, రుచీ-పచి చాలాబాగున్నాయి" కలువ కళ్లను కమ్మగా తిప్పింది.

"ఆ చాయ్ ఎంత బాగుందో!" కళ్లు విశాలమైపోతూంటే శ్రీమతి పాపారావు వాసవి పక్కకొచ్చింది. మా ముందు గాజుల గలగల అందెల రవళితో నలుగురు శ్రీమతులూ ఒకరిపక్క ఒకరు కలిసి నడుస్తూంటే చూడముచ్చటగా ఉంది.

'మనమేమన్నా తక్కువ తిన్నామా?' అనుకుంటూ మగమహారాజులం మొహాలు చూసుకున్నాం. కుడిచేత్తో నాగేశం చెయ్యందుకుని, ఎడమ చేత్తో భీమేశ్వర్ వేలందుకున్నాను. "ప్రకాశేశ్వరాలయం చీకటి మనసుల్లో వెలుగు నింపేస్తుంది గదా!" అంటూ పాపారావుకు కళ్లతో సైగ చేసాను. అతడు భీమేశ్వర్ చెయ్యందుకున్నాడు. "చతుర్విధ పురుషార్థాల్లో చివరిదైన మోక్షసాధన ముఖ్యమైంది. దేవాలయప్రాంగణాలు మనిషి ఆలోచనా కేంద్రాలు. జీవితంలో చేసిన, చేస్తున్న పాపపుణ్యాలను మనసులో బేరీజు వేసుకుని భవిష్యత్తులో ఏంచేస్తే మోక్షం లభిస్తుందనే ఆలోచనకు ఆచరణ రూపమిచ్చే ప్రశాంత నిలయాలు. ఆచరణ నిరాఘాటంగా సాగాలని మూలవిరాట్టు ముందు సాగిలబడి ఆశీస్సులందుకుంటాము" నా మనోభావాలు




బయటికొచ్చాయి.

నలుగురం ఒకరిపక్క ఒకరం, ఒకే వరుసలో నడుస్తున్నాము.

"పదండి ముందుకు, పదండి పరుగున, పదండి పదండి పైపైకి..." బస్సును కళ్లతో చూపిస్తూ పాటందుకున్నాడు నాగేశం. పల్లం నుంచి పైకి గబగబా వెళుతున్నాము.

పదిగజాలు ముందుకెళ్లామో లేదో భీమేశ్వర్ మోకాళ్లు పుచ్చుకుని "అబ్బో! ఇది ఘాట్ రోడ్డు. నా మోకాళ్లు మొరాయిస్తున్నాయ్ బాబోయ్!" చేతులెత్తేశాడు.

మా బస్సు హారన్ భయంకరంగా వినబడింది.

శ్రీమతులు స్పీడుగా మాకంటే ముందు... వెనక్కి తిరిగి చూడకుండా వెళుతున్నారు. మాకు మతిపోతోంది.

"ఇట్లా చీమ నడకెందుకూ? చిట్టెలుకల్లా పరుగెడుదాం పదండేహె". శ్రీమతుల్ని అసూయగా చూస్తూ మాటలతూటా పేల్చేశాడు నాగేశం. నోటిమాటకు నొసటిరాత సహకరించాలిగదా!

"నేను మామూలుగా నడుస్తా బాబూ!" పాపారావు అరచేతులు చీలమండల్ని పుణికాయి. అందరికంటే వెనక బస్సెక్కింది మేమే.

"హమ్మయ్య!" సీటునాక్రమిస్తూ చిరునవ్వులు విదిలిస్తున్నాడు నాగేశం. "అందరికంటే ముందు దిగి, చివరికెక్కాం. మన ప్రత్యేకత మనకుంది". అందరికీ వినబడేలా అన్నాడు కానీ ఎగదోసుకొస్తున్న ఆయాసం బట్టబయలైంది.

"చూసారా!" నా పక్కన కూచుంటున్న భవాని కనురెప్పలు గర్వంగా ఎగిరిపడినై... "మా తమ్ముడంటే... మాటలా మజాకా?" ●